క్లుప్తంగా

ఘనంగా కంఠమహేశ్వర స్వామి కల్యాణం



సూర్యాపేటలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

భానుపురి : సూర్యాపేట పట్టణంలో కంఠమహేశ్వర స్వామి సురమాంబ దేవి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణానికి చెందిన గౌడ కులస్తులు శనివారం అర్ధరాత్రి స్వామి వారి ఆలయానికి బోనాలతో చేరుకొని ప్రదక్షిణలు చేశారు. అనంతరం జెట్టి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణాన్ని గౌడ కులస్తులు తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చివ్వెంల : విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ మల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కుడకుడలోని లింగా నగర్, భాగ్యనగర్, జీఎంఆర్ టౌన్ షిప్, కీర్తి నగర్ గ్రామాలు, కలెక్టర్ ఆఫీస్‌లతో పాటు, ఐలాపురం, కోమటికుంట, ఎంజీ నగర్ తండాల వ్యవసాయ భూములకు విద్యుత్ సరఫరాలో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రభ బండ్ల ప్రదక్షిణలు



శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయం చుట్టూ తిరుగుతున్న ప్రభ బండ్లు

మద్దిరాల : మండల కేంద్రంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పారువేట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణం అనంతరం ఆలయం చుట్టూ ప్రభ బండ్లను తిప్పారు. అదేవిధంగా స్వామివారికి రుద్రాభిషేకం, హోమం, రథబలి, నవగ్రహ హోమం, శాలబలి, భూత బలి కార్యక్రమాలను నిర్వహించినట్లు అర్చకుడు శివప్రసాద్ శర్మ తెలిపారు. అదే విధంగా స్వామి వారిని అశ్వవాహనంపై ఊరిగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నిధులను ఇతర రంగాలకు కేటాయించవద్దు

మద్దిరాల : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర రంగాలకు కేటాయించడం మానుకోవాలని, ఆ నిధులను భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంట నాగయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నాగెల్లి రామనర్సయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాల ఎస్సీకాలనీలో నీటికి కటకట

అర్వపల్లి : కొమ్మాల గ్రామ ఎస్సీకాలనీలో నీటికి కటకట ఏర్పడింది. మిషన్‌భగీరథ నీరు సక్రమంగా రాకపోవడం, కాలనీకి వచ్చే రక్షిత మంచినీటి పథకం బోరు నీళ్లు నిలిచిపోవడంతో నీటి సమస్య ఏర్పడింది. గత నాలుగు రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నామని విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఎస్సీకాలనీ వాసులు తెలిపారు. కాలనీలో నీళ్లు లేక సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద నుంచి తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాలనీలో నీటి సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

గొడుగుల పంపిణీ



మండల కేంద్రంలో గొడుగులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నూతనకల్ : లయన్స్ క్లబ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చిరువ్యాపారులకు ఆదివారం గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా మాట్లాడారు. చిరువ్యాపారులు ఎండ, వేడిమి, వర్షాలకు ఇబ్బందులు పడకుండా వారికి రక్షణ కవచంగా ఉండడానికి గొడుగులను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి ఏలేటి నారాయణరెడ్డి, బందు కృష్ణయ్య, తీగల గిరిధర్‌రెడ్డి, సాబాది వెంకట్‌రెడ్డి, భూరెడ్డి సంజీవ రెడ్డి, నాగం సుధీర్‌రెడ్డి, చురుకంటి చంద్రారెడ్డి, బద్దం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలేవి..

- గ్రామాల్లో అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- వీధుల్లో మురుగు నిలిచి విజృంభిస్తున్న దోమలు
- ఫాగింగ్ చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం

మద్దిరాల : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లో డ్రెయినేజీలు పూర్తిగా పూడిపోయి నీరు నిలుస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. అధికారులు పారిశుద్ధ్య వారోత్సవాలను చేపట్టినప్పటికీ.. పనులను తూతూ మంత్రంగా చేసి వదిలేశారు. పారిశుద్ధ్య వారోత్సవాలు కేవలం ఫొటోలకే పరిమితయ్యాయని ప్రజలు అంటున్నారు. దోమల బెడద కారణంగా సాయంత్రం అయితే ఇళ్లలో ఉండలేకపోతున్నామని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.



కుక్కడంలో పూడుకపోయిన డ్రెయినేజీ

ఫాగింగ్ చేయడంలో నిర్లక్ష్యం..

మద్దిరాల మండల పరిధిలోని చాలా గ్రామాల్లో డ్రెయినేజీలు పూడిపోయాయి. మురుగునీరంతా వీధుల వెంట పారుతోంది. కొన్ని ప్రాంతాల్లో నీరు నిలుస్తోంది. దీంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. గ్రామాల్లో అధికారులు దోమల నివారణ చర్యలు చేపట్టడంలేదని.. ఫాగింగ్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దోమల కారణంగా గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయని, ఇప్పటికైనా వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రత్యేక చర్యలు చేపట్టి దోమలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇళ్లలో ఉండలేక పోతున్నాం



"వీధుల వెంట నిర్మించిన డ్రెయినేజీలు నిండిపోయాయి. వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇళ్ల ముందు మురుగు నీరు నిలిచిపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఒకవేళ కరెంట్‌పోతే ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రెయినేజీలకు మరమ్మతులు చేపట్టాలి. కాలువల్లో క్రిమిసంహారక మందులు పిచికారీ చేయించాలి.

– జలగం యాకస్వామి, కుక్కడం

ఫాగింగ్ చేయాలి



"దోమల కారణంగా అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా మారడంతో దోమలకు నిలయంగా మారాయి. అధికారులు వెంటనే దోమల నివారణ చర్యలు చేపట్టాలి. గ్రామాల్లో ప్రతి రోజూ సాయంత్రం ఫాగింగ్ నిర్వహించాలి. ఇళ్ల వెంబడి, వీధుల్లో మురుగు నీరు నిల్వకుండా చూడాలి. దోమ తెరలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాలి.

– రాంపాక వెంకన్న, మద్దిరాల

పిల్లలమర్రిలో ఘనంగా రథోత్సవం



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

సూర్యాపేట రూరల్ : మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా మండల పరిధిలోని పిల్లలమర్రిలో ఆదివారం తెల్లవారు జామున రథోత్సవం ఘనంగా నిర్వహించారు. మహాదేవ నామేశ్వరస్వామి దేవాలయం నుంచి ఎరకేశ్వర స్వామి దేవాలయం వరకు గ్రామ వీధుల్లో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని రథాన్ని లాగుతూ, డీజే పాటలకు నృత్యాలు చేశారు. వేడుకల్లో దేవాలయ కమిటీ చైర్మన్ కొట్ల సైదులు, డైరెక్టర్‌లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం పట్టణశాఖ అధ్యక్షుడిగా హన్మంతు



తిరుమలగిరి : తిరుమలగిరిలో ఆదివారం యాదవ సంఘం పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిర్రబోయిన హన్మంతు, ఉపాధ్యక్షుడిగా లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల స్వామి, ప్రధాన కార్యదర్శిగా కొమ్ము మధు, కోశాధికారిగా ఏనుగుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

మృతికి సంతాపం

తుంగతుర్తి : మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న విజయ్‌కుమార్ (57) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో మృతి చెందాడు. ఆయన మృతి పట్ల ఎంపీపీ గుండగాని కవిత రాములుగౌడ్, ఎంపీడీఓ శేషుకుమార్, ఎంపీఓ భీంసింగ్, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

గడ్డివాము దగ్ధం

మద్దిరాల : కోతులకు వేసిన బాంబు వల్ల గడ్డివాము దగ్ధమైన సంఘటన చిన్ననెమిల గ్రామ ఆవాసం గుట్టకాడి తండాలో ఆదివారం జరిగింది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోత్ మల్సూర్ తన తన వ్యవసాయ భూమిలో కోతులను బెదిరించేందుకు టపాకాయలను పేల్చాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు పక్కనే ఉన్న గడ్డివాముపై పడ్డాయి. దీంతో దాదాపు 300 మోపుల గడివాము దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు.

భవన నిర్మాణాలకు సుధాబ్యాంక్ రుణాలు

భానుపురి : సుధాబ్యాంకు ద్వారా భవన నిర్మాణాల కోసం రుణాలను మంజూరు చేయనున్నట్లు సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ తెలిపారు. ఆదివారం స్థానిక బాలాజీ గ్రాండ్‌లో బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు, గృహ నిర్మాణ రంగం ప్రముఖులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తూ నమ్మకానికి మారుపేరుగా నిలిచిన సుధాబ్యాంకు నుండు భవన నిర్మాణ రంగంలో రుణాలకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్, డైరెక్టర్‌లు కక్కిరేణి చంద్రశేఖర్, ఏపూరి శ్రవణ్, భోనగిరి భాస్కర్, మీలా సందీప్, వైస్ చైర్మన్ పానుగోటి నిర్మల, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య, పెద్దిరెడ్డి రాజా, సూర్యాపేట బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మడిపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహదేవ్

రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించాలి



మాట్లాడుతున్న బూర వెంకటేశ్వర్లు

దురాజ్‌పల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా రూ. 500లకే గ్యాస్ సిలిండర్ నేరుగా లబ్ధిదారులకు అందించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్యాస్ సిలిండర్ తీసుకుంటే లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలలో పైసలు జమ చేస్తామనడం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఈ సమావేశంలో నిమ్మల ప్రభాకర్, పెండ్రా కృష్ణ దండుగల సురేష్, కృష్ణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



మద్దిరాల : గోరెంట్లలోని ప్రభుత్వ పాఠశాలలో..

నూతనకల్ : మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో 2001–2002 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి తరగతి గదుల్లోని జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : అనంతారం గ్రామంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో 2002–2003 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆ గ్రామంలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, నారాయణ, పూర్ణచారి, భిక్షం, నర్సరాజు, సురేష్, అంజయ్య, వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : గోరెంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000 విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జి.వెంకన్న, మహేష్, అశోక్, శోభన్ బాబు, శ్రావణి, ఉమ, ఉపాధ్యాయులు రంగారెడ్డి, లక్ష్మీనారాయణ, మల్లయ్య, సుమన్ పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

సకల దేవతల స్వరూపిణి గోమాత



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు (ఎస్) : సకల దేవతల స్వరూపిణి గోమాత అని శ్రీ సంతోషి మాత దేవాలయం అధ్యక్ష, కార్యదర్శులు నూకా వెంకటేశం గుప్త, బ్రహ్మాండ్లపల్లి మురళీధర్ అన్నారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని ఆత్మకూర్(ఎస్) మండలం పాత సూర్యాపేట స్టేజీ వద్ద శ్రీ సంతోషి మాత ఉద్యాన వన క్షేత్రంలోని గోశాలలో గోపూజలు నిర్వహించారు. మారేడు చెట్టు వద్ద శివ లింగానికి ప్రత్యేక పంచామృత అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గోవును పూజించడం వల్ల సకల దేవతలను పూజించిన ఫలం కలుగుతుందని పురాణాల్లో చెప్పబడిందని తెలిపారు. ఏ ప్రాంతంలో నైతే గోవులను పూజిస్తారో ఆ ప్రాంతం ఎంతో సస్యశ్యామలంగా ఉంటుందని అన్నారు. ప్రతి పౌర్ణమి, అమావాస్య రోజున గోపూజలు, పరమ శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ బాధ్యులు కొత్త మల్లికార్జున్, పబ్బా ప్రకాశ్, నరేంద్రుని విద్యాసాగర్ రావు, సోమా శ్రీశైలం, బోనగిరి విజయ్ కుమార్, నామిరెడ్డి పాపి రెడ్డి, యామ వెంకటేశ్వర్లు, దేవరశెట్టి సోమయ్య, గోపారపు రాజు, బొల్లం సురేష్, బజ్జూరి శ్రీనివాసు, కొత్త వెంకటేశ్వర్లు, యామ రాంమూర్తి, గుండా శ్రీనివా సు, గుండా వెంకటేశ్వర్లు, యాస లక్ష్మి, సువర్ణ, విజ యలక్ష్మి, సుగంధ మాల, మల్లికాంభ, అర్చకులు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడేనికి ఊరేగింపుగా ఉత్సవ విగ్రహాలు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియడంతో జాజిరెడ్డిగూడెంలోని నర్సింహస్వామి దేవాలయం నుంచి ఉత్సవాల కోసం తెచ్చిన ఉత్సవ విగ్రహాలు, మకరతోరణాలు, కవచంలను ఆదివారం రాత్రి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అయితే ప్రతి ఏడాది మాదిరిగానే స్వామి బ్రహ్మోత్సవాలకు జాజిరెడ్డిగూడెం దేవాలయం నుంచి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చి ఉత్సవాలు పూర్తయ్యాక తిరిగి అక్కడికి తీసుకెళ్లారు. దేవరాజ వాహనం, పల్లకిలలో నర్సింహస్వామి అమ్మవార్లు శ్రీదేవి, భూదేవిలతో పాటు గోదాదేవి విగ్రహాలను ఉంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటింటికీ టెంకాయలు కొట్టి హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, ధర్మకర్తలు జేరుపోతుల సోమయ్య, కనుకు రేణుక, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, యోగానంద్, పవన్‌కుమార్, నాయకులు బైరబోయిన మహరాజు, మేకల రాంబాబు, బింగి శ్రీకాంత్, మల్లేష్, వీరయ్య, సురేష్, సుతారపు పిచ్చయ్య, శిగ రవి తదితరులు పాల్గొన్నారు.



దేవరాజ వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలి



తిరుమలగిరిలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్

తిరుమలగిరి : అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్ కోరారు. ఆదివారం తిరుమలగిరిలో సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బలహీన వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణ పనుల మంజూరుకు అనుమతి ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేయించామని తెలిపారు. ఆ స్థలాలలో ఉన్న పేదలందరికీ పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఎల్లంల యాదగిరి, ఎం.లక్ష్మయ్య, ప్రభాకర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి



సూర్యాపేట టౌన్ : మాట్లాడుతున్న లింగయ్య



తిరుమలగిరి : తొండ గ్రామంలో సావిత్రీబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



దురాజ్‌పల్లి : సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



తుంగతుర్తిలో సావిత్రీబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



తుంగతుర్తిలో సావిత్రీబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేటటౌన్ : ఈ దేశంలో బడుగు బలహీన వర్గాలకు విద్య అవసరమని, బాల్య దశలోనే మొదటి ఉపాధ్యాయురాలిగా విద్య అందించిన గొప్ప మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య, కమ్యునిస్టు యూనిటీ సెంటర్ కో కన్వీనర్ షేక్ అబ్దుల్ కరీం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బీడీఎస్‌యూ(బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సావిత్రీ బాయి పూలే బహుజనులను విజ్ఞానం వైపు మళ్లించడానికి కృషి చేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు చామకూరి నర్సయ్య, గాలి వికాస్‌కుమార్, రామచంద్రన్, భానుప్రసాద్, దడిపల్లి వెంకట్, వెంకటేశ్వర్లు, వీరునాయుడు, అనిల్‌కుమార్, మనోజ్‌కుమార్, సురేష్, సంధ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

దురాజ్‌పల్లి : దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రీబాయి పూలే అందించిన సేవలు మరువలేనివని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ అన్నారు. పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేటలోని బీసీ బాలికల హాస్టల్‌లో సావిత్రీబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేవలం నాలుగేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి, ఉచిత విద్య అందించిన మహనీయురాలు సావిత్రీబాయి అని కొనియాడారు. ఆమె ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ప్రతినిధులు మండడి శ్రీధర్, కావ్య, నాసిమ్, ఉష, నవ్య, సంయుక్త, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో అభ్యుదయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సావిత్రీబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మహేష్, వెంకన్న, ఎల్లయ్య, భాస్కర్, లక్ష్మయ్య, కృష్ణయ్య, ప్రవీణ్, సైదులు, ముత్తయ్య, ఉప్పలయ్య, అజయ్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటకొండ సీతయ్య అన్నారు. ఆదివారం సావిత్రీబాయి పూలే వర్ధంతి మండల కేంద్రంలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములు గౌడ్, గోపగాని రమేష్, వెంకన్న, వెంకటనారాయణ, శ్రీను, వెంకటేష్, ప్రసాద్, సైదులు, సమీర్ పాల్గొన్నారు.

ఆశయసాధనకు కృషి చేయాలి

సావిత్రీబాయి పూలే ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పెండెం రాంమూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సావిత్రీబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల ఆశా కిరణం సావిత్రీబాయి పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంకూరి రమేష్, తడకమళ్ల పరశురాములు, కొండ రాజు, బొంకూరి రంజిత, మరికంటి అశోక్, అక్కెనపల్లి నరేష్, అబ్దుల్, రమేష్, బాబు పాల్గొన్నారు.

చినగారకుంటతండా వాసికి డాక్టరేట్



బానోతు చాంప్లా

సూర్యాపేటటౌన్ : సూర్యాపేటలో నివాసముంటున్న గరిడేపల్లి మండలం చిన గారకుంటతండాకు చెందిన బానోతు చాంప్లా లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని గవర్నమెంట్ సిటీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్. రవికుమార్ పర్యవేక్షణలో 'తెలంగాణ రాష్ట్ర సెంట్రల్ లైబ్రరీలో సేకరణ, అభివృద్ధి' అనే అంశంపై తాను చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించినట్లు ఆదివారం చాంప్లా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా చాంప్లాకు పలువురు అభినందనలు తెలియజేశారు.

ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి

నూతనకల్ : నీరు లేక ఎండిపోయిన వరి పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కందాల శంకర్ రెడ్డి కోరారు. ఆదివారం మండల పరిధిలోని చిలకుంట్లలో ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎండిన పంటలను గుర్తించి ప్రభుత్వం ఎకరానికి రూ. 20వేల పరిహారం అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కూసు సైదులు, తొట్ల లింగయ్య, అలీపురం శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పుల వెంకన్న, తొట్ల అన్వేష్, బద్దం నరేష్, దాసరి రవి పాల్గొన్నారు.



ఎండిన పంటలను పరిశీలిస్తున్న నాయకులు

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : వేల్పుచర్ల గ్రామానికి చెందిన సంపత్ సైదులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో మృతుడి కుటుంబాన్ని ఆదివారం గ్రామ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పరామర్శించారు. ఈ సందర్భంగా క్వింటా బియ్యం, ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు వజ్జె రవి, గైగుళ్ల వీరయ్య, ఖమ్మంపాటి జగన్, చెరుకు శ్రీనివాస్, చిక్కుల శేఖర్, రాంబాబు పాల్గొన్నారు.